క్లుప్తంగా

పెన్షనర్ల అసోసియేషన్ తాలూకా కమిటీ ఎంపిక



నూతన అధ్యక్షుడు చలపతిని సన్మానిస్తున్న సభ్యులు

ధర్మవరం అర్బన్: ధర్మవరం తాలూకా పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షుడిగా ఏకిల చలపతి మూడోసారి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. పట్టణంలోని ఎన్జీఓ హోం పక్కన ఉన్న పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం నూతన కమిటీని ఎంపిక చేశారు. ధర్మవరం తాలూక పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఏకిల చలపతి, గౌరవాధ్యక్షుడిగా రామయ్య, ప్రధాన కార్యదర్శిగా నర్సిరెడ్డి, కోశాధికారిగా సుధాకర్, ఉపాధ్యక్షులుగా నారప్ప, శ్రీరాములు, శివలింగన్న, కొండయ్య, రామచంద్రప్ప, సహాయ కార్యదర్శులుగా శ్రీనివాసులు, వెంకటస్వామి, రామిరెడ్డి, కుళ్లాయప్ప, కేశవయ్యను ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడు చలపతి మాట్లాడుతూ.. పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తానని తెలిపారు. అనంతరం నూతన అధ్యక్షుడిని శాలువాలు, పూలమాలలతో సన్మానించారు.

'ఇండియా ఫర్ ఇండియా'కు విరాళం

కదిరి అర్బన్: ఆర్డీటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇండియా ఫర్ ఇండియా కార్యక్రమానికి సోమవారం రిటైర్డ్ ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ హరిమోహన్ రూ.10 వేల విరాళాన్ని నల్లచెరువు మండల సమాఖ్య అధ్యక్షుడు రెడ్డెప్పకు అందజేశారు. మొటుకుపల్లిలోని ఆర్డీటీ దివ్యాంగ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల పోషణార్థం సాయం చేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీటీ సిబ్బంది రవీంద్ర, మస్తాన్‌రెడ్డి, కిరణ్ పాల్గొన్నారు.

న్యాయ సేవలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి మజీజ్ పాసపాల సయ్యద్

పుట్టపర్తి టౌన్: న్యాయ సేవలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జూనియర్ సివిల్ జడ్జ్ మజీజ్ పాసపాల సయ్యద్ పేర్కొన్నారు. సోమవారం పుట్టపర్తి డిపోలోని ఆర్టీసీ ఉద్యోగులకు న్యాయపరమైన అంశాలపై అవగాహన కల్పించేందుకు డిపో మేనేజర్ ఇనయతుల్లా అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగులు, కార్మికులు రాజ్యాంగంలో కల్పించిన న్యాయపరమైన అంశాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో అర్బన్ సీఐ సునీత సూపర్‌వైజర్లు హరిత, ఉషారాణి, గ్యారేజ్ ఇన్‌చార్జ్ విజయానంద అసోసియేషన్ల నాయకులు పాల్గొన్నారు.

నూనె గింజల ప్రాముఖ్యతపై అవగాహన



వేరుశనగ విత్తనాలు పంపిణీ చేస్తున్న బెస్ట్ ఇన్నోవేషన్ యూనివర్శిటీ పరిశోధకులు

పుట్టపర్తి టౌన్: బెస్ట్ ఇన్నోవేషన్ యూనివర్శిటీలో సోమవారం కర్ణాటక కో–ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ (కేఓఎఫ్) ఆధ్వర్యంలో నూనె గింజల ప్రాముఖ్యత వాటి ఆదాయ సామర్థ్యం విజయవంతంపై సమావేశం నిర్వహించారు. బెస్ట్ ఇన్నోవేషన్ యూనివర్శిటీ పరిశోధన డైరెక్టర్ డాక్టర్ రాంగోపాల్, కేఎఫ్ఓ మేనేజర్ వైభవ్ వేరుశనగ గింజల ఉత్పత్తి, ప్యాకేజింగ్, మార్కెటింగ్ వ్యూహాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రైతులకు వివరించారు. అనంతరం కే6 రకం వేరుశనగ విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. సమావేశంలో 150 మంది రైతులు పాల్గొన్నారు.

కార్యదర్శిపై చర్యలు తీసుకోండి

ప్రశాంతి నిలయం: తనపై వివక్ష చూపుతున్న పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని సోమందేపల్లి మండలం తుంగోడు పంచాయతీ సర్పంచ్, దళిత మహిళ గంగమ్మ సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు ఫిర్యాదు చేసింది. వివరాలు.. తుంగోడు పంచాయతీ ఇన్‌చార్జ్ పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న కేశవమూర్తి.. సర్పంచ్ గంగమ్మపై వివక్ష చూపుతున్నారు. పంచాయతీ కార్యాలయానికి రావొద్దని హుకుం జారీ చేస్తున్నారు. మరో ఐదు నెలలు మాత్రమే సర్పంచ్ పదవీ కాలం ఉందని.. పనులన్నీ టీడీపీ నాయకులే చేసుకుంటారంటూ కార్యదర్శి సర్పంచ్‌ను వేధిస్తున్నారు. గతంలో చేసిన పనులకు సంబంధించిన కాంట్రాక్ట్ పనులకు బిల్లులు పెట్టకుండా అడ్డుకుంటున్నారని జాయింట్ కలెక్టర్‌కు సర్పంచ్ ఫిర్యాదు చేశారు.

అడుగుకో గుంత



ఒంటికొండ సమీపంలో రోడ్డుపై గుంతలు



నరసింగరాయనిపల్లి సమీపంలో అధ్వానంగా ఉన్న రహదారి



ఒంటికొండ మలుపు వద్ద ఇలా..

- తీవ్ర ఇబ్బందుల్లో గ్రామీణులు

చెన్నేకొత్తపల్లి: రహదారులు గుంతలమయంగా మారడంతో గ్రామీణులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెన్నేకొత్తపల్లి మండల పరిధిలోని ఒంటికొండ నుంచి ఆమిదాలకుంట వరకూ దాదాపు 5 కి.మీ పొడవునా రహదారి గుంతలమయంగా మారింది. చెన్నేకొత్తపల్లి నుంచి జిల్లా కేంద్రమైన పుట్టపర్తికి వెళ్లేందుకు అనేక మంది ఈ రహదారి గుండానే వెళుతూ ఉంటారు. చెన్నేకొత్తపల్లి నుంచి ఒంటికొండ వరకూ దారి బాగానే ఉంది. అక్కడ నుంచి ఆమిదాలకుంట వరకూ అడుగుకో గుంత ఉండటంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఎన్నికల సమయంలో ఒంటికొండ వరకూ రహదారిని నిర్మించారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడి 11 నెలలు కావస్తున్నా ఒంటికొండ నుంచి ఆమిదాలకుంట రోడ్డు నిర్మాణాన్ని పట్టించుకోకపోవడంతో వాహనదారులకు పగటి పూటనే చుక్కలు కనిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఈ రహదారిని వేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



ఓబులాంపల్లి గ్రామ సమీపంలో కంకర తేలిన రోడ్డు

సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమిస్తాం



ఆర్డీఓ వీవీఎస్ శర్మకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం



ఆర్డీఓ మహేష్‌కు వినతిపత్రం అందిస్తున్న నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ సభ్యులు



పుట్టపర్తిలో ఆర్డీఓ సువర్ణకు వినతిపత్రం అందజేస్తున్న ఎన్ఎంయూ కార్మికులు

ధర్మవరం అర్బన్: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ జోనల్ వైస్ ప్రెసిడెంట్ బీఎస్ శేఖర్, జిల్లా చైర్మన్ బి.ముత్యాలప్ప, రీజనల్ నాయకులు శంకరయ్య, డిపో కార్యదర్శి మధుసూదన్ డిమాండ్ చేశారు. సోమవారం ఆర్డీఓ మహేష్‌కు వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆర్టీసీలో వీసీ, ఎండీ ఉద్యోగులకు పనిష్మెంట్ విషయంలో ఇచ్చిన 01/2019 సర్క్యులర్‌ను డిపోలో అమలు పరచాలని కోరారు. గ్యారేజీ సిబ్బంది, పని సామగ్రి కొరత ఉన్నా పని గంటలకు మించి పని చేయిస్తున్నారని తెలిపారు. మహిళా సిబ్బందికి ప్రత్యేక పరిస్థితుల్లో అవసరమైన సెలవులు మంజూరు చేయించాలని సూచించారు. అనారోగ్యంతో ఉన్న మహిళలకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని తెలిపారు. డిపోల్లో కనీస అవసరాలైన రెస్ట్ రూమ్స్, టాయిలెట్స్ సదుపాయాలు కల్పించాలని పేర్కొన్నారు. రిటైర్డు అయిన సిబ్బందికి కనీస పెన్షన్ లేని పరిస్థితుల్లో ఆరోగ్యశ్రీ, వృద్ధాప్య పింఛన్ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ డిపో ట్రెజరర్ వైవీఎస్ రెడ్డి, సీసీఎస్ డెలిగేట్ జీఎస్ రాయుడు, గ్యారేజ్ సెక్రటరీ హరికృష్ణ, నాయకులు మంజునాథ్, ప్రసాద్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

కదిరి అర్బన్: ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఆర్డీఓ వీవీఎస్ శర్మకు కదిరి ఆర్టీసీ డిపో నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఎన్ఎంయూ నాయకులు బైరిశెట్టి, ఓబులేసు, ప్రభాకర్‌రెడ్డి, నారాయణస్వామి, రవీంద్ర, నారాయణరెడ్డి, చారీ, ఈశ్వర్ రెడ్డి, లక్ష్మీనారాయణ, అయూబ్ పాల్గొన్నారు.

పుట్టపర్తిలో..

పుట్టపర్తి టౌన్: ఆర్టీసీ ఉద్యోగుల అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనిటి అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఆర్డీఓ సువర్ణ, తహసీల్దార్ కళ్యాణ్ చక్రవర్తికి వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. గత ఏడాది నవంబర్‌లో ఆర్టీసీ ఎండీకి 38 డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశామన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని గతంలో ఉన్నతాధికారులకు యూనియన్ తరుపున వినతిపత్రాలు అందజేశామని అయితే సమస్యలు పరిష్కరించడంలో ఆర్టీసీ యజమాన్యం విఫలమైందన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిరసన కార్యక్రమాలు చేపట్టామన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు



విద్యార్థికి నగదు బహుమతి అందజేస్తున్న దృశ్యం

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన పలువురు విద్యార్థులకు సోమవారం కమ్మరవాండ్లపల్లికి చెందిన టీచర్ వరదారెడ్డి ఆధ్వర్యంలో నగదు బహుమతులు అందజేశారు. బాలుర ఉన్నత పాఠశాలలో మొదటి స్థానం సాధించిన హర్షవర్ధన్‌కు (589 మార్కులు) రూ.2,500, ద్వితీయ స్థానంలో నిలిచిన నరసింగదేవకు (584 మార్కులు) రూ.2,500, తృతీయ స్థానంలో నిలిచిన మోక్షవర్ధన్‌కు (561 మార్కులు) రూ.1,000, బాలికల ఉన్నత పాఠశాలలో మొదటి స్థానంలో నిలిచిన శివానికి (575 మార్కులు) రూ.2,500, ద్వితీయ స్థానం సాధించిన నదితకు (564 మార్కులు) రూ.1,500, తృతీయ స్థానం సాధించిన మమతకు (556 మార్కులు) రూ.1,000 నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏవీఎం రావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీ సేవలు కొనసాగించాలి

తనకల్లు: ఆర్డీటీ సేవలను కొనసాగించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో పార్టీ మండల కన్వీనర్ అశోక్‌వర్ధన్ రెడ్డి విలేకరులతో మాట్లాడారు. ఐదు దశాబ్దాలుగా ఆర్డీటీ సంస్థ నిరుపేదలకు అండగా నిలుస్తోందన్నారు. పేదలకు ఇళ్లు, వైద్యం, విద్య ఉచితంగా అందజేస్తూ ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోందని గుర్తు చేశారు. ఆర్డీటీని కాపాడుకోవడం అందరి బాధ్యత అన్నారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం ఆర్డీటీ ఎఫ్‌సీఆర్ఏ రెన్యువల్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బీఎస్ కలాం, ముస్తఫా, భాస్కర్‌రెడ్డి, సమరసింహారెడ్డి, శంకర్‌రెడ్డి, చాంద్‌బాషా, సూరి, అమాన్, డీలర్ నరసింహులు, లక్ష్మీపతి, ప్రకాష్, హరినాథ్ రెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ర్యాలీ..

ఆర్డీటీని కాపాడుకుందామని చీకటిమానిపల్లి, బొంతలపల్లి, గేమేనాయక్ తండా, కోటపల్లికి చెందిన ప్రజలు సోమవారం మండల కేంద్రంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న ఫాదర్ ఫెర్రర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. జాతీయ రహదారి–42 మీదుగా నినాదాలు చేసుకుంటూ తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లారు. కార్యక్రమంలో ఆర్డీటీ ఆశయ సాధన కమిటీ చైర్మన్ తోపు పారేసు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యుడు శ్రీనివాసులు, నాయకులు చంద్రప్ప, వేమనారాయణ, నరసింహులు, హర్షవర్ధన్, సురేష్, కిష్టప్ప, రమణ నాయక్, రమణమ్మ, అంజనమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పార్టీ మండల కన్వీనర్ అశోక్‌వర్ధన్ రెడ్డి

కుట్టు మిషన్ల పథకం పేరుతో దోపిడీ

పుట్టపర్తి టౌన్: కూటమి ప్రభుత్వం బీసీలకు కుట్టు మిషన్ల పథకం పేరుతో కోట్ల రూపాయలు దోపిడీ చేస్తోందని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వడ్డె నారాయణ విమర్శించారు. సోమవారం బీసీ నాయకులతో కలసి కొత్తచెరువు మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బలహీన వర్గాల వారిని ఆర్థికంగా బలోపేతం చేయడానికి బీసీ మహిళలకు కుట్టు శిక్షణ ఇచ్చి కుట్టు మిషన్లు పంపిణీ చేస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. ఈ పథకం అమలుకు రాష్ట్ర వ్యాప్తంగా రూ.257 కోట్ల నిధులు కేటాయించిందని తెలిపారు. రెండు మూడు కంపెనీలతో సిండికేట్ చేసుకుని కుట్టు మిషన్లు ఇవ్వకనే ఇచ్చినట్లు చూపి రూ.176 కోట్ల దోపిడీ పథకం రచిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలను గ్రామ స్థాయిలో అవగాహన కల్పిస్తామన్నారు. కూటమి ప్రభుత్వం దోపిడీకి అడ్డుకట్ట వేసి రాష్ట్రంలో బీసీ వర్గాల నిధులు దుర్వినియోగం కాకుండా చూస్తామని తెలిపారు. కార్యక్రమంలో పాదయాత్ర వాల్మీకి శంకర్, బీసీ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు నారాయణ

ఎదురెదురుగా ఢీకొన్న కార్లు

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని గరుడంపల్లి క్రాస్ వద్ద సోమవారం రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటన చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు.. అనంతపురం పట్టణంలోని అరవింద్ నగర్‌కు చెందిన కిషోర్ కుమార్ తన కారులో పుట్టపర్తి నుంచి అనంతపురం వైపు వస్తున్నాడు. కొత్తచెరువుకు చెందిన సత్యనారాయణ తన కారులో అనంతపురం నుంచి కొత్తచెరువుకు వెళ్తుండగా.. గరుడంపల్లి సమీపంలోకి రాగానే ప్రమాదవశాత్తూ రెండు కార్లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కిషోర్ కుమార్‌కు చెందిన కారు బోల్తా పడగా సత్యనారాయణకు చెందిన కారు ముందు భాగం దెబ్బతింది. అయితే ఈ ప్రమాదంలో ఇరువురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.



బోల్తా పడిన కారు

ఇంగ్లిష్ మీడియం ఉండాల్సిందే



ధర్మవరంలో డిప్యూటీ తహసీల్దార్ ఈశ్వరయ్యకు వినతిపత్రం అందిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు



కదిరి: తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తున్న టీచర్లు

కదిరి: ప్రభుత్వ బడుల్లో తెలుగు మీడియంతో పాటు ఆంగ్ల మాధ్యమం ఉంటాల్సిందే అని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోనంకి అశోక్ కుమార్ డిమాండ్ చేశారు. ఇంగ్లిష్ మీడియం లేకపోతే విద్యార్థులు ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు వెళ్లిపోయే ప్రమాదం ఉందన్నారు. ఏపీటీఎఫ్ కదిరి జోన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట జిల్లా కార్యదర్శి కమతం ఆది బయన్న అధ్యక్షతన ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 117 జీఓను తక్షణం రద్దు చేయాలని కోరారు. ఫౌండేషన్ స్కూల్స్ ఆలోచనను కూడా కూటమి ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఉన్న 1 నుంచి 5 వ తరగతి వరకూ ప్రాథమిక పాఠశాలలు, 1 నుండి 8వ తరగతి వరకూ ప్రాథమికోన్నత పాఠశాలలు, 1 నుంచి 5 వరకు మోడల్ ప్రైమరీ స్కూల్స్, 6 నుంచి 10 వరకు ఉన్న ఉన్నత పాఠశాలలను కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పూర్వ ప్రధాన కార్యదర్శి జెరిపిటి త్రిమూర్తి, ఏపీటీఎఫ్ జిల్లా సబ్ కమిటీ సభ్యులు నారాయణ, రాజశేఖర్, రాష్ట్ర కౌన్సిలర్లు గంగాధర్, లీలావతి, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధర్మవరం అర్బన్: ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమిస్తామని ఏపీటీఎఫ్ రాష్ట్ర నాయకుడు బీకే ముత్యాలప్ప, జిల్లా ఉపాధ్యక్షుడు సానే రవీంద్ర రెడ్డి హెచ్చరించారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం జోనల్ నాయకుడు బలరాముడు అధ్యక్షతన ఒకరోజు ధర్నా చేపట్టారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వెంటనే పీఆర్సీ కమిటీ వేయాలన్నారు. 30 శాతం ఐఆర్ ప్రకటించి, సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను మంజూరు చేయాలని సూచించారు. గతంలో ఆరు రకాల పాఠశాలలను ఇప్పుడు తొమ్మిది రకాల పాఠశాలలుగా మారుస్తూ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ ఈశ్వరయ్యకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ మండలాల నాయకులు ఈశ్వరయ్య, శివానంద, శ్రీనివాసులు, జగదీష్, బాలయ్య, నరసింహులు, హరిప్రసాద్, గోపాల్, శంకర్‌నారాయణ, వాసుకుమార్, రవికుమార్, హేమంత్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

తనకల్లు: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవమ్మ తెలిపారు. మండల పరిధిలోని కొక్కంటిలో సోమవారం సీడీపీఓ జయంతి ఆదేశాలతో కిశోర వికాసం-వేసవి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలికలు బాగా చదువుకోవడం వల్ల కుటుంబంతో పాటు సమాజంలోనూ మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. బాల్య వివాహాలను అరికట్టడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. 15–18 ఏళ్ల మధ్య ఉన్న కిశోర బాలికలను గ్రూపులుగా ఏర్పాటు చేసి నెలలో రెండు సమావేశాలను ఏర్పాటు చేసి బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తామన్నారు. అంతకుముందు కిశోర బాలికలతో కలిసి ర్యాలీ చేపట్టారు. సర్పంచ్ వైవీ మల్లీశ్వరీ, ఎంపీహెచ్ఓ షెక్సీనా, ఏఎన్ఎం కవిత, కార్యకర్తలు జబీన్‌తాజ్, భాగ్యలక్ష్మీ, వెంకటలక్ష్మీ, కార్యకర్త సుబ్బమ్మ పాల్గొన్నారు.

రేపు విద్యార్థులకు సన్మానం

ఓడీచెరువు: జిల్లాలోని వసతి గృహాల్లో చదువుతూ పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఈనెల 7వ తేదీన విజయవాడలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి సన్మానిస్తారని హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ రవీంద్రా రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఓడీచెరువు మండలానికి చెందిన ఎస్సీ హాస్టల్ విద్యార్థి పి.అజిత్ కుమార్ 570 మార్కులతో ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే టాపర్‌గా నిలిచాడు. విద్యార్థితో పాటు విద్యార్థి తల్లిదండ్రులు, హాస్టల్ వార్డెన్‌ను కూడా సన్మానించడం జరుగుతుందని పేర్కొన్నారు.

చెత్తతో సంపద తయారీకి చర్యలు



ఇంటింటా చెత్త సేకరిస్తున్న పారిశుధ్య కార్మికులు


సాక్షి ఎఫెక్ట్..

నల్లమాడ: 'సంపద సృష్టించేదెన్నడు?' శీర్షికన సోమవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. నల్లమాడ పంచాయతీ కేంద్రంలో సోమవారం పారిశుధ్య కార్మికులు ఇంటింటా చెత్త సేకరించి సంపద కేంద్రానికి తరలించారు. పంచాయతీ కార్యదర్శి విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ.. నల్లమాడ గ్రామ పంచాయితీ పరిధిలోని గ్రామాల్లో రోజూ చెత్త సేకరించడం జరుగుతోందన్నారు. సేకరించిన చెత్తను తడి, పొడి చెత్తగా వేరు చేసి సంపద కేంద్రంలోని తొట్టిల్లో కుళ్లబెట్టడం చేస్తున్నామన్నారు. ఇలా కుళ్లబెట్టిన చెత్తతో ఇప్పటికే రెండు తొట్టిలు నిండాయని తెలిపారు.

'కళ్ల ఆపరేషన్‌కు సాయం చేస్తాం'

నల్లచెరువు: మండల పరిధిలోని ఉప్పార్లపల్లి గ్రామంలో రేష్మిత అనే విద్యార్థిని కంటి సమస్యతో బాధపడుతుండటంతో సోమవారం సాక్షి దినపత్రికలో 'కమ్ముకుంటున్న చీకట్లు' శీర్షికతో కథనం ప్రచురితమైంది. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పూల శ్రీనివాసరెడ్డి, గాండ్లపెంట మండల వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీకాంత్ రెడ్డి స్పందించారు. విద్యార్థి రేష్మిత కళ్ల ఆపరేషన్‌కు అయ్యే ఖర్చును భరించేందుకు ముందుకొచ్చారు. విద్యార్థి రేష్మిత కళ్ల సమస్యతో బాధపడుతున్న విషయాన్ని వెలుగులోకి తెచ్చిన సాక్షిని అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థిని రేష్మిత తల్లిదండ్రులు ప్రభాకర్ రెడ్డి, అమరావతి తదితరులు కదిరికి వెళ్లి పూల శ్రీనివాసరెడ్డి, శ్రీకాంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రవికుమార్‌రెడ్డి, నాయకులు మాధవరెడ్డి, ఆదిమూర్తి పాల్గొన్నారు.

సరస్వతీ అలంకారంలో వాసవీమాత



కదిరి టౌన్: పట్టణంలోని వాసవీమాత ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు. వాసవీ మాతను వివిధ రకరకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. సరస్వతీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు ప్రసాదం అందజేశారు. ఈనెల 7వ తేదీన వాసవీ మాత జయంతి సందర్భంగా అమ్మవారు మూడు రోజుల పాటు వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శనమిస్తారు.

బాత్‌రూంలో పడి వృద్ధురాలి మృతి



కదిరి టౌన్: మున్సిపల్ పరిధిలోని రాయచోటి రోడ్డు కుమ్మర వీధికి చెందిన సుగుణమ్మ (70) బాత్‌రూంలో పడి మృతి చెందింది. వివరాలు.. సోమవారం రాత్రి బాత్‌రూంకు వెళ్లిన సుగుణమ్మ తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు అనుమానంతో బాతురూం డోర్ తెరిచి చూడటంతో ఆమె అపస్మారక స్థితిలో పడి ఉంది. హుటాహుటిన సుగుణమ్మను కదిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఇంటి పెద్ద దిక్కు చనిపోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు.



పీఆర్‌టీ వీధిలోని ప్రధాన రహదారిపై పేరుకుపోయిన చెత్తాచెదారం

చెత్త తొలగదు.. కంపు వదలదు

ధర్మవరం పట్టణం పీఆర్‌టీ వీధిలోని ప్రధాన రహదారిపై చెత్తాచెదారం పేరుకుపోయింది. ఉదయం నుంచి రాత్రి వరకూ చెత్తాచెదారాన్ని తొలగించక పోవడంతో దుర్వాసన వస్తోంది. పీఆర్‌టీ వీధిలో ఉన్న బట్టల షాపులకు వస్తున్న ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ చెత్తాచెదారం ఉన్న ప్రాంతానికి రాగానే వాసన వస్తుండటంతో ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రధాన రహదారి వద్ద నిత్యం చెత్తాచెదారం ఉండటంతో అక్కడ చెత్తకుండీ ఏర్పాటు చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కనీసం ఇప్పటికైనా ఈ ప్రదేశంలో చెత్తకుండీ ఏర్పాటు చేస్తే బాగుంటుందని కాలనీవాసులు కోరుతున్నారు.

– ధర్మవరం అర్బన్: